క్లుప్తంగా

మూడో రోజు రెండు నామినేషన్లు



మూడో సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వో సుధాసాగర్‌కు అందిస్తున్న సూర్యప్రకాశ్

రామచంద్రపురం: నామినేషన్ల పర్వం మొదలైన తరువాత మూడో రోజు శనివారం నాడు మరో రెండు నామినేషన్లను దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఎస్.సుధాసాగర్ విలేకరులకు తెలిపారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను వేసినట్లు తెలిపారు. కాగా ఇదివరకు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ధాఖలు చేయగా మూడవ సెట్ నామినేషన్‌ను సూర్యప్రకాశ్ వేసినట్లు తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా కాటే సుబ్రహ్మణ్యం నామినేషన్ వేసినట్లు ఆర్వో సుధాసాగర్ తెలిపారు. దీంతో కలిపి మూడు రోజుల్లో మొత్తం తొమ్మిది సెట్ల నామినేషన్లు వచ్చినట్లు ఆర్వో వెల్లడించారు.

వైభవంగా లక్ష్మీనారాయణుని కల్యాణం



వెలంపాలెం లక్ష్మీనారాయణుని కల్యాణ రథోత్సవం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి పాలక క్షేత్ర పరిధిలోని 12 గుండాల్లో ఒకటైన బ్రహ్మగుండం వద్ద వేంచేసియున్న భీమేశ్వరాలయ క్షేత్రపాలకుడు శ్రీ లక్ష్మీ సమేత నారాయణస్వామి దివ్య కల్యాణం శుక్రవారం రాత్రి కన్నులపండువగా నిర్వహించారు. గ్రామోత్సవం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, ధ్వజారోహన అనంతరం స్వామి కల్యాణ క్రతువును అంగర ప్రభాకరాచార్యులు, బృందావనం సత్యనారాయణాచార్యులు, సంపర గోపాలాచార్యులు, అంగర లక్ష్మీనారాయణాచార్యుల బ్రహ్మత్వంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. శనివారం స్వామి కల్యాణ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల నుంచి భీమేశ్వరాలయానికి తీసుకుని వెళ్లి మళ్లీ గ్రామానికి రథోత్సవాన్ని జరిపించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చక స్వాములు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని విశేషంగా అలంకరించారు. గ్రామంతో పాటు పడమర ఖండ్రిక, కోరుమిల్లి, మాచర, కపిలేశ్వరపురం, తాతపూడి, వెదురుమూడి, నల్లూరు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహక కమిటీ, దాతలు సహకారంతో దూరపు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించారు.

ఎన్నికల ప్రచార ర్యాలీని విజయవంతం చేయండి

కాజులూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం జరుగనున్న వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచార ర్యాలీని విజయవంతం చేయాలని ఎంపీపీ మాత భారతి అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ రామచంద్రపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి తిప్పరాజుపాలెం, అయితపూడి, పెనుమళ్ళ, తనుమళ్ళ గ్రామాల్లో ఎన్నికల ప్రచార ర్యాలీని జరుగుతుందన్నారు. మండల గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సహకార సంఘాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరు కావాలన్నారు.

ఆళ్ల కుటుంబానికి వెంకన్నబాబు పరామర్శ

మండపేట: మాతృ వియోగంతో బాధపడుతున్న మండలంలోని కేశవరానికి వైఎస్సార్ సీపీ నాయకులు ఆళ్ల ఏసురాజు, ఆళ్ళ వెంకటేశ్వరరావు సోదరులను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎంపీటీసీ సభ్యుడు అన్నందేవుల కృష్ణారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తుపాకుల ప్రసన్నకుమార్, పార్టీ నాయకులు బందెల సాయిరామ్, యడ్ల రవి, అందుకూరి నయారబాబు, కొక్కిరి శేఖర్ పాల్గొన్నారు.

పేరిలింగం సాహిత్య కృషి ఎనలేనిది

కపిలేశ్వరపురం: కె.గంగవరం మండలం పామర్రుకు చెందిన హేతువాది డి.పేరిలింగం సాహిత్య కృషి ప్రశంసించతగినదని అంగర గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పెద్దింశెట్టి రామకృష్ణ అన్నారు. స్థానికంగా శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల మృతి చెందిన పేరిలింగంకి నివాళి అర్పించారు. రాజమహేంద్రవరంలో స్థిరపడిన పేరిలింగం హేతువాదిగా చివరి శ్వాసవరకూ నిబద్ధతతో సామాజికాభివృద్ధికి కృషి చేశారన్నారు.

ఘనంగా లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన

ఆలమూరు: గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన శ్రీలక్ష్మీ గణపతి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా ప్రారంభమైంది. వేద పండితులు కాళ్లకూరి దుర్గాప్రసాద్ శర్మ, వెలవలపల్లి చైతన్యకృష్ణ నేతృత్వంలోని పురోహితుల బృందం ఈ పూజలను చేపట్టింది. ఈనెల 22న ఉదయం 10.49 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ తెలియజేసింది.

ఓటేసి అభివృద్ధికి అండగా నిలవండి

- జగన్ మరోసారి సీఎం అయితే అన్ని వర్గాలకూ మేలు
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించి, నియోజకవర్గ, రాష్ట్ర అభివృద్ధికి ప్రజలందరూ అండగా నిలవాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి అసెంబ్లీ అభ్యర్థి అయిన తనను, అమలాపురం లోక్‌సభ అభ్యర్థి రాపాక వరప్రసాదరావును భారీ మెజారటీతో గెలిపించాలని కోరారు. తాను నియోజకవర్గానికి వచ్చినప్పటి నుంచి ఏ విధంగా ప్రజలకు అందుబాటులో ఉంటున్నానో, ఏ విధంగా అభివృద్ధి చేశానో ప్రజలకు బాగా తెలుసునన్నారు. 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా వేగుళ్ల జోగేశ్వరరావు గెలిచినప్పటికీ అనంతరం జరిగిన మూడు మండలాల జెడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులే విజయం సాధించారన్నారు. అంతేగాకుండా మూడు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీ ఏకఛత్రాధిపత్యంగా ఏలుతున్న మండపేట మున్సిపాలిటీని కూడా వైఎస్సార్ సీపీ హస్తగతం చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. తన వద్దకు వచ్చిన ప్రతి సమస్యనూ పార్టీలు, కులాలకు అతీతంగా పరిష్కారానికి కృషి చేశానే తప్ప, ఎలాంటి ప్రయోజనాన్ని ఆశించలేదన్నారు.

నిర్మాణదారులూ.. మార్పు గమనించండి

నియోజకవర్గంలో భవన నిర్మాణాలు తలపెట్టిన వారు గతంలో ఎలా ఇబ్బంది పడే వారో, తానిక్కడకు వచ్చాక పరిస్థితులు ఎంత సానుకూలంగా మారాయో ఓసారి గుర్తుకు చేసుకోవాలని తోట త్రిమూర్తులు అన్నారు. లోగడ ఏదైనా ఇల్లు లేదా, షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణం చేపట్టాలంటే కొందరు భయపడి వెనుకంజ వేశారన్నారు. ఈ విషయంలో తాను నష్టపోయినప్పటికీ అలాంటి వారికి మాత్రం న్యాయం చేకూర్చానన్నారు. ఇప్పుడు పట్టణంలో ఇళ్లు కట్టుకోవాలంటే ఎవరికీ జడిసే పని లేదన్నారు. గతంలో 100 గజాల లోపు స్థలం ఉన్న వారు గృహాలు నిర్మించుకోవాలంటే ఎన్నో ఇబ్బందులు పడాల్సి వచ్చేదని, కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవన్నారు. ఎన్నికల అనంతరం పార్టీ నాయకులతో సమగ్ర సమీక్ష జరిపి నియోజకవర్గాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తానని త్రిమూర్తులు అన్నారు. మీడియా సమావేశంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజబాబు, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, మున్సిపల్ కౌన్సిల్ విప్ పోతంశెట్టి వరప్రసాద్, పార్టీ నాయకులు మండా గోవిందరెడ్డి, యాండ్ర బుజ్జి, పాలింగి కిషోర్, వల్లూరి రామకృష్ణ, సిరిపురపు శ్రీనివాస్, శిరంగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చినరాజప్ప వ్యాఖ్యలకు ఖండన

ఏరోజూ తాను కాపులను ఉద్ధరించానని ఎక్కడా అనలేదని, తనన ఆశ్రయించిన వారందరికీ ప్రయత్న లోపం లేకుండా సాయం చేశానని తోట త్రిమూర్తులు అన్నారు. కాపులను తోట త్రిమూర్తులు ఉద్ధరించేమీ లేదని మాజీ హోం మంత్రి నిమ్మకాయల చిన రాజప్ప చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. టీడీపీ ప్రభుత్వంలో కాపు ఉద్యమం ఉవ్వెత్తున లేచినపుడు కాపులకు మీరెంత వరకూ సహరించారో రాష్ట్ర మంతటా తెలుసన్నారు. ఆ రోజున కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం కాపు రిజర్వేషన్‌ల కోసం ఉద్యమం చేపడితే ఏ విధంగా ఆయనపైనా ఆయన కుటుంబంపైనా ఉక్కుపాదం మోపారో అందరికీ తెలుసన్నారు.

24న తోట త్రిమూర్తులు నామినేషన్

- ఉదయం 10:40 గంటలకు ముహూర్తం
- పార్టీ శ్రేణులంతా భారీగా తరలి రావాలని పిలుపు

మండపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈనెల 24న తాను నామినేషన్ దాఖలు చేస్తానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రకటించారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులు రెడ్డి రాధాకృష్ణ, వేగుళ్ల పట్టాభిరామయ్యచౌదరితో కలిసి త్రిమూర్తులు శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. బుధవారం ఉదయం 10:40 గంటలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆఫీసులో నామినేషన్ వేస్తానని చెప్పారు. స్థానిక విజయలక్ష్మి నగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులతో కలసి భారీ ఎత్తున ఊరేగింపుగా బయలుదేరి వెళ్లి నామినేషన్ సమర్పిస్తానని తోట త్రిమూర్తులు ప్రకటించారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ అభిమానులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, పార్టీ కార్యకర్తలందరూ ఇదే ఆహ్వానంగా భావించి నామినేషన్ మహోత్సవంలో పాల్గొనాలని కోరారు. ముహూర్తానికి రెండు గంటల ముందుగా అందరూ పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో మున్సిపల్ కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, పార్టీ నాయకులు వల్లూరి రామకృష్ణ, మేడిశెట్టి సూర్యభాస్కరరావు, మండా గోవిందరెడ్డి, సన్మాల ధనరాజు, కోనాల చంద్రబోస్, యాండ్ర ప్రభాకరరావు, సిరిపురపు శ్రీనివాస్, విప్పర్తి సంపత్‌రావు, తాతపూడి రాజేష్ శర్మ, పాలింగి కృష్ణకుమార్, వీరెల్లి సత్యనారాయణ, శీలం భాస్కరరావు, శిరంగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తోటకు మద్దతుగా 30వ వార్డులో ప్రచారం



వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మండపేట: వైఎస్సార్ సీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులుకు మద్దతుగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి, ఆ పార్టీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని 30వ వార్డులో ఎన్నికల ప్రచారం చేశారు. ఆ వార్డులోని సంఘం కాలనీ 1, 2 వీధుల్లో వారంతా పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. స్థానికులందరినీ కలిసి ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. ఇవే సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాలని సూచించారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి మండపేట నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తోట త్రిమూర్తులును గెలిపించాలని విన్నవించారు. ప్రచారంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు వేగుళ్ల నారాయణరావు, పిల్లి గణేశ్వరరావు, దాసరి నూకరాజు, బిళ్లకుర్తి పరమేశ్వరరావు, వెంకన్న, జంపా పార్థసారథి, మాడా సూర్యనారాయణ, షేక్ అలీఖాన్ బాబా, గోరు అన్నవరం, సాధనాల శివ భగవాన్, జొన్నపల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక మెజారిటీ మన లక్ష్యం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు
- ఏడిదలో ఆ పార్టీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం



ఏడిదలో వైఎస్సార్ సీపీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు

మండపేట: గ్రామాల్లో వైఎస్సా ర్‌సీపీ అత్యధిక మెజారిటీ సాధించేలా స్థానిక నాయకులు వ్యూహాత్మకంగా పని చేయాలని ఆ పార్టీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు సూచించారు. మండలంలోని ఏడిద గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ ఎన్నికల కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఆ పార్టీ ఏడిద గ్రామశాఖ అధ్యక్షుడు పలివెల సుధాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ అమలాపురం పార్లమెంటరీ అభ్యర్థి రాపాక వరప్రసాద రావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తోట త్రిమూర్తులు రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కుడుపూడి భవాని, పార్టీ నాయకులు గారపాటి అశోక్‌కుమార్, ఈదర వీరాస్వామి, సర్పంచులు వరదా చక్రవర్తి, బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, నక్కా సింహాచలం, ఎంపీటీసీలు పట్నాల నాగబాబు, తాతపూడి ఉషా రాజేష్, పార్టీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, రామిశెట్టి శ్రీహరి, వల్లూరి రామకృష్ణ, మేడిశెట్టి సూర్య భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ఆరోగ్య కార్యక్రమాలు సక్సెస్

- డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావుదొర
- వాకతిప్ప పీహెచ్‌సీ సందర్శన



వాకతిప్ప పీహెచ్‌సీలో వైద్య, ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

కపిలేశ్వరపురం: వైద్య ఆరోగ్య కార్యకర్తలు, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందితో సమన్వయంతో వ్యవహరిస్తే జాతీయ స్థాయి ప్రభుత్వ అవగాహన కార్యక్రమాలు విజయవంతం అవుతాయని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి దుర్గారావుదొర అన్నారు. మండలంలోని వాకతిప్ప పీహెచ్‌సీని శనివారం ఆయన సందర్శించారు. ఆసుపత్రిలో సేవలు, సిబ్బంది పని తీరు, రికార్డులు, మందుల నిల్వలను తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. ఆసుపత్రి సేవల తీరు, క్షేత్ర స్థాయి పరిస్థితులను వైద్యాధికారులు పి.చంద్రమౌళి, చిట్టూరి రాకేష్ చౌదరి వివరించారు. దుర్గారావుదొర మాట్లాడుతూ షెడ్యూలు ప్రకారం నిర్వహించే జాతీయ కార్యక్రమాలు, ఇమ్యూనైజేషన్ కార్యక్రమం, వడదెబ్బ నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వేసవి ప్రభావం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజా ఆరోగ్య పరిరక్షణకై చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ పరిధిలోని వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు



సంస్థ ప్రతినిధులను సత్కరిస్తున్న గురుకుల పాఠశాల సిబ్బంది

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో గుంటూరు జిల్లా చిలకలూరి పేటకు చెందిన సెయింట్ థెరిసా పారిస్ సంస్థ మిషన్ రూహ్ వాటర్ ప్లాంట్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను శనివారం ప్రారంభించారు. సుమారు రూ.2.50 లక్షలతో ఏర్పాటు చేసిన సంస్థ ప్రతినిధులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ ఎన్‌వీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ సమన్వయ అధికారి టి.ఉమాదేవి, వైద్యాధికారి రాజేష్, సంస్థ ప్రతినిధులు జోసఫ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటా.. సమస్యలు పరిష్కరిస్తా..

ప్రచారంలో దూకుడు పెంచిన సూర్యప్రకాశ్



పాణింగపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్

కె.గంగవరం: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందని రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తారనని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. మండలంలోని పాణింగపల్లి, అముజూరు గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ ఈ ప్రభుత్వ హయాంలో సంక్షేమ లబ్ధి పొందారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధించారన్నారు. కులం, మతం, పార్టీ భేదాల్లేకుండా టీడీపీ, జనసేనల వారికి కూడా సంక్షేమాన్ని అందించిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సంక్షేమ ప్రభుత్వం కావాలో, జన్మభూమి కమిటీలు కావాలో ప్రజలకు ఇప్పటికే ఆలోచించి సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాబట్టి ప్రజలతా తమ విలువైన ఓటును ఎమ్మెల్యే అభ్యర్థిగా నాకు, ఎంపీ అభ్యర్థిగా రాపాక వరప్రసాద్‌కు ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కి ఓటేయాలని కోరారు. ఆయన పార్టీ నాయకులతో కలసి ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టికూటి రాజశేఖర్, ఎంపీపీ పంపన నాగమణి, వైస్ ఎంపీపీ నీతిపూడి మధుబాల, సర్పంచ్‌లు చీకట్ల సునీత, నానాపరపు కళ్యాణి, సొసైటీ అధ్యక్షులు వైట్ల అచ్యుతరామయ్య, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ పందు గోవిందరాజు, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు, బీసీ నాయకులు పంపన సుబ్బారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అర్తమూరులో ఉచిత హోమియో వైద్య శిబిరం



శిబిరంలో రోగికి హోమియో మందు వేస్తున్న భాస్కరరెడ్డి

మండపేట: పేదల ఆరోగ్య రక్షణకు 28 ఏళ్లుగా పాటుపడుతున్న ఎస్‌బీఎస్‌ఆర్ ట్రస్టు సేవలు అభినందనీయమని అర్తమూరు సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, భాస్కరరెడ్డి దంపతులు అన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన వారిద్దరూ మాట్లాడుతూ పరిసర గ్రామాల ప్రజలకు ఈ ఉచిత హోమియో వైద్య సేవలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ట్రస్టు వ్యవస్థాపకుడు సత్తి బులిస్వామిరెడ్డి మాట్లాడుతూ వృద్ధులకు, మహిళల రుగ్మతలకు హోమియో వైద్యం మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. రాజమహేంద్రవరంలోని డాక్టర్ అల్లూరి రామలింగయ్య ప్రభుత్వ హోమియో వైద్యశాల డాక్టర్ల శరోన్ బిందు, ఎం. ఉమాదేవి, సీహెచ్ కీర్తి ప్రియ, కె. సుమ మాధురి ,కె. పద్మావతి, ఎం.వీరభద్రరావు వైద్య పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిర్ల జయరామ్ రెడ్డి , గొలుగూరి సందీప్‌రెడ్డి, సత్తి లక్ష్మణ్ రెడ్డి, సత్తి సత్యనారాయణ, తాడి కోదండ రామారెడ్డి, సత్తి సత్యనారాయణ రెడ్డి, తేతలి ఆదిరెడ్డి ,తాడి శ్రీనివాసరెడ్డి, ఓగిరెడ్డి రామారెడ్డి, తాడి సుబ్బిరెడ్డి, చింతా వెంకటకృష్ణారెడ్డి, వెలగల శివారెడ్డి ఉదగిరి ఆంజనేయులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలు కలకాలం నిలుస్తాయి



మాచవరంలో హెచ్‌ఎం జగన్మోహినీ దంపతులను సత్కరిస్తున్న స్థానిక నేతలు

రాయవరం: ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని, అయితే ఉద్యోగి విధుల్లో అందించిన ఉత్తమ సేవలు కలకాలం నిలిచి ఉంటాయని పలువురు పేర్కొన్నారు. మండలంలోని మాచవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం పదవీ విరమణ చేయనున్న ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పున్నమరాజు జగన్మోహినికి వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేడపాటి వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు, ఉప సర్పంచ్ పడాల వసంత్‌కుమార్ రెడ్డి, పాఠశాల మానిటరింగ్ కమిటీ చైర్మన్ వెలగల అచ్యుతరామారెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి హెచ్‌ఎం జగన్మోహిని చేసిన కృషిని ప్రశంసించారు. విద్యాభివృద్ధికి నిరంతరం తపించిన హెచ్‌ఎం జగన్మోహిని సేవలను మిగిలిన ఉపాధ్యాయులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం హెచ్‌ఎం జగన్మోహిని దంపతులను దుశ్శాలువా, పూలమాలలు, జ్ఞాపికతో సత్కరించారు. స్థానిక నేతలు మేడపాటి చంద్రశేఖరరెడ్డి, ద్వారంపూడి రాధాకృష్ణారెడ్డి, పడాల రాజారెడ్డి, తాడి సూర్యకిరణ్‌రెడ్డి, వెలగల లక్ష్మీనారాయణరెడ్డి, మల్లిడి రామారెడ్డి, సత్తి భామిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తనిఖీల్లో 4.16 లక్షల నగదు స్వాధీనం



మండపేట బైపాస్ రోడ్డు టోల్ గేట్ వద్ద వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

మండపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో రూ.4.16 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్టు మండపేట నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎల్లారావు మీడియాకు తెలిపారు. బైపాస్ రోడ్డు టోల్ గేట్ వద్ద శనివారం సీఐ షేక్ అఖిల్ జమ పర్యవేక్షణలో టౌన్ ఎస్ఐ హరికోటి శాస్త్రి వాహన తనిఖీలు జరిపారు. ఈ క్రమంలో కె. కృష్ణకాంత్‌కు చెందిన హోండా ఇమేజ్ కారులో రూ. లక్ష నగదు లభించింది. ఎలాంటి ఆధారాలు చూపని ఆ నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి అజీజ్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అలాగే మండలంలోని జెడ్. మేడపాడులో ఎస్ఎస్‌టీ బృందం తనిఖీలు నిర్వహించింది. బైక్‌పై వెళుతున్న అదే గ్రామానికి చెందిన పెనుమత్స గౌరీ శంకరరాజు నుంచి రూ.2.46 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు బృందం అధికారి టి. వెంకటలక్ష్మి తెలిపారు. కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి లాకులు వద్ద ఎస్ఎస్‌టీ బృందం నిర్వహించిన తనిఖీల్లో పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం వల్లూరు కు చెందిన ఉయ్యూరు శ్రీనివాస్ రాజుకు చెందిన కారులో రూ. 70 వేలు లభ్యమయ్యాయి. ఎస్ఎస్‌టీ బృందం అధికారి ఐ .మాణిక్యం ఆ సొమ్మును స్వాధీనం చేసుకున్నారని ఎల్లారావు తెలిపారు. కేసులు నమోదు చేశామన్నారు.

వైభవంగా సత్యలింగేశ్వరుని కల్యాణం

మామిడికుదురు: పెదపట్నంలంకలో కొలువుదీరిన ఉమా సత్యలింగేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల కోలాహలం నడుమ సత్యలింగేశ్వరుని కల్యాణం ఆద్యంతం కమనీయంగా నిర్వహించారు. పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన మంటపంలో ఉమా దేవితో సత్యలింగేశ్వరుని కొలువుదీర్చారు. బ్రహ్మశ్రీ ఆదిరాజు రఘునాథశర్మ, సూర్యకుమారి దంపతులు కర్తలుగా పాల్గొని సత్యలింగేశ్వరుని కల్యాణ ఘట్టాన్ని జరిపించారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కాజులూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. శనివారం గొల్లపాలెం ఆర్బీకేలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఓ పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఆర్బీకేల్లో ధాన్యం విక్రయించిన రైతులకు గోనె సంచులు, కూలీలు, రవాణా చార్జీలతో పాటు పంట సొమ్ములు 21 రోజుల వ్యవధిలో వారి బ్యాంక్ ఖాతాకు జమ చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తే డబ్బులు రావని నమ్మిస్తూ పంటకు బయట మార్కెట్‌లో తక్కువ ధర చెల్లిస్తున్నారని రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ మూలారెడ్డి, వీఏఏ వనుం శ్రీరమ్య, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం

రాయవరం: మండలంలోని లొల్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ మహా కైలాస లింగేశ్వర సహిత గర్భాంతర వరసిద్ధి వినాయక స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ పూజలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక చెరువు మధ్యలో నిర్మించిన ఆలయంలో యలమంచిలి సత్యనారాయణవర్మ శివాచార్య అర్చకత్వంలో వరసిద్ధి వినాయక ప్రతిష్ఠ పూజలను ప్రారంభించారు. తొలుతగా విగ్రహాలకు భక్తులు గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం యాగశాల ప్రవేశం చేశారు. శైవాగమ విధానంలో పూజాదికాలు చేశారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, దీక్షాద్వయ, రుత్విక్ వరుణ, అఖండ దీపారాధన, ప్రధాన కలశారాధన తదితర పూజలు నిర్వహించారు. ఆదివారం ప్రత్యేక పూజల అనంతరం సోమవారం విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గుండెపోటుతో దంత వైద్యుడి మృతి



ఇళ్ల వెంకటేశ్వర్లు (ఫైల్)

రామచంద్రపురం రూరల్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పేరు పొందిన దంత వైద్యుడు ఇళ్ల చిన వెంకటేశ్వర్లు (72) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. గడచిన 55 ఏళ్లుగా ఆయన ద్రాక్షారామలో దంత వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం దంత వైద్యులు ప్రతి గ్రామంలోనూ అందుబాటులో ఉంటున్నారు. కానీ 55 సంవత్సరాలుగా సుదూర ప్రాంతాల నుంచి కూడా ఈయనను వెదుక్కుంటూ వచ్చేవారు. దంత వైద్యానికి అంతలా ఆయన పేరు పొందారు. ఆయనకు భార్య పార్వతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి తమ సంతాపం తెలిపారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం: రామచంద్రపురం మండలం 132 కేవీ సబ్‌స్టేషన్‌లో రామచంద్రపురం–కాకినాడ డీసీ వర్కు నిమిత్తం విద్యుత్ సరఫరాను రెండు రోజుల పాటు నేడు, రేపు (ఆది, సోమవారం) నిలిపివేస్తున్నట్టు రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.విజయానంద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు 33 కేవీ రాయవరం ఫీడర్, 11కేవీ ఫీడర్ రామచంద్రపురం 3వ ఫీడర్ పరిధిలోని కాకినాడ రోడ్, వైఎస్సార్ నగర్, రాజబాబునగర్, రైల్వేస్టేషన్, చోడవరం, కొత్తూరు ప్రాంతాల్లోని సర్వీసులకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: మండంలోని శివల బస్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.విజయానంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని కె.గంగవరం, సత్యవాడ, తామరపల్లి, కుందూరు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు మండపేటలో..

మండపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం పట్టణంలో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ విజయానంద్ శనివారం తెలిపారు. ఏడిద రోడ్డు, పేరంటాళమ్మ గుడివీధి, ప్రభుత్వాసుపత్రి వెనుక, సంఘం పుంత రోడ్డు, గాంధీ నగరం, పార్థసారథి నగర్, సైథిల్ పేట, బిక్కిన అమ్మన్న నగర్‌తో పాటు గుమ్మిలేరు రోడ్డులో కూడా సరఫరాను అంతరాయం కలుగుతుందన్నారు.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేద పండితుల స్వామికి తులసి పూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

అయినవిల్లి: మండలంలోని ఎస్.పెదపాలెంలో కొలువైన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణం శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా జరిపారు. ఆలయ అర్చకులు, వేదపండితులు ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు జరిపారు. గ్రామస్తులు రాయుడు రాధాకృష్ణ–సత్యవతి దంపతులు స్వామివారి కల్యాణ నిర్వహించారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తుల తాకిడి అధికమైంది. పలు గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేశారు.